ఎలా ప్రిపేరవుతున్నరు..!

జిల్లా గ్రంథాలయంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, ఏప్రిల్5: బడంగ్‌పేటలోని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శుక్రవారం సందర్శించారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షల కోసం ప్రిపేరవుతున్న విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఎలా చదువుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలో ఉన్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. రోజు ఎంత మంది గ్రంథాలయంలో చదువుకుంటున్నారని తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలన్నారు.

ఎస్సీ యువతకు ఉచిత కోచింగ్

ధారూరు, ఏప్రిల్ 5: జిల్లాలోని ఎస్సీ నిరుద్యోగ యువతీ, యువకులకు గ్రూప్స్ పరీక్షలకు సంబంధించి ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న వివిధ ఉద్యోగాల నియామక ప్రక్రియలో భాగంగా వికారాబాద్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తి చేసిన వంద మంది ఎస్సీ నిరుద్యోగ యువతీ, యువకులకు మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కోచింగ్ సమయంలో అభ్యర్థులకు హాస్టల్ వసతి, భోజన సదుపాయంతో పాటు అవసరమైన స్టడీ మెటీరియల్ అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు 7013200133 ఫోన్ నంబరులో సంప్రదించాలని తెలిపారు.

నేడు చేవెళ్లలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

- హాజరుకానున్న మాజీ మంత్రి పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్, ఏప్రిల్ 5: నేడు చేవెళ్లలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ శ్రేణులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10.30గంటలకు చేవెళ్లలోని శంకర్‌పల్లి చౌరస్తాలో నిర్వహించే ధర్నా కార్యక్రమానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు హాజరవుతున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

ముహూర్తం ఖరారు..

ఆదిబట్ల మున్సిపల్ కార్యాలయం

- నేడే ఆదిబట్ల చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక
- వారం రోజులు ముందే సభ్యులకు నోటీసులు అందజేసిన అధికారులు
- చైర్మన్‌గా మర్రి నిరంజన్‌రెడ్డి ఎన్నికయ్యే అవకాశం!
- వైస్‌చైర్మన్‌పై వీడని చిక్కుముడి...
- ఏర్పాట్లు పూర్తి చేసిన మున్సిపల్ అధికారులు

ఆదిబట్ల, ఏప్రిల్ 5: ఎట్టకేలకు ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు ముహూర్తం ఖరారైంది. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను నిర్వహించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంకకు.. ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్‌కు గత వారం రోజుల క్రితం హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో నాలుగు రోజుల క్రితం 15 మంది కౌన్సిలర్లకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. నేడు ఉదయం 11 గంటలకు చైర్మన్ ఎన్నిక, ఉదయం 11:30 గంటలకు వైస్ చైర్మన్ ఎన్నికను నిర్వహించారు. నూతన చైర్మన్‌గా మర్రి నిరంజన్‌రెడ్డి దాదాపుగా ఖరారైనట్లు సమాచారం. వారం రోజులుగా విహారయాత్రలో ఉన్న సభ్యులు నేడు నేరుగా మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్న ఓటింగ్‌లో పాల్గొననున్నారు.

భారీ బందోబస్తు..

చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశాం. మున్సిపల్ కార్యాలయం చుట్టూ బారికేడ్లను ఏర్పాటు చేసి నలుగురు ఎస్ఐలు సహా 20మంది సిబ్బందితో నిఘాను పటిష్టం చేశాం. ఇప్పటికే మున్సిపాలిటీ పరిసరాలను ఆధీనంలోకి తీసుకున్నాం.

- రాఘవేందర్‌రెడ్డి సీఐ, ఆదిబట్ల

ఏర్పాట్లు పూర్తి..

ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి చేశాం. నేడు జరుగనున్న సమావేశానికి హాజరు కావాలని నాలుగు రోజుల క్రితమే 15 మంది కౌన్సిలర్లకు నోటీ సులు జారీ చేశాం. ఉదయం 11 గంటలకు చైర్మన్.. ఉదయం 11:30 వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుంది.

-బాలకృష్ణ, ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్

వైస్ చైర్మన్‌పై వీడని చిక్కుముడి..

వైస్ చైర్‌పర్సన్ కోరే కళమ్మపై అవిశ్వాసం పెట్టడంతో ఆ పదవికి తీవ్ర పోటీ నెలకొన్నది. వైస్ చైర్మన్ రేసులో బీఆర్ఎస్ నుంచి కోరే కళమ్మ, మహేందర్, వనం శ్రీను.. కాంగ్రెస్ పార్టీ నుంచి మర్రి అర్చన, కామండ్ల యాదగిరి, దాసు.. బీజేపీ నుంచి పొట్టి రాములు పోటీలో ఉన్నట్లు సమాచారం. దీంతో ఆ పదవి ఎవరిని వరిస్తుందో నేడు తేలనున్నది.

8న సదరం స్లాట్‌లు విడుదల

రంగారెడ్డి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత

షాబాద్, ఏప్రిల్ 5: ఈ నెల 8న ఏప్రిల్, మే నెలకు సంబంధించి సదరం స్లాట్లను బుక్ చేసుకునేందుకు మీ సేవ ఆన్‌లైన్ స్లాట్స్‌ను విడుదల చేయనున్నట్లు రంగారెడ్డి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డీఆర్‌డీవో ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 11గంటలకు సదరం స్లాట్‌లు విడుదల చేయనున్నట్టు తెలిపారు. ఈ సదరం క్యాంపునకు హాజరు కావాలనుకునే దివ్యాంగులు రంగారెడ్డి జిల్లాకు చెందిన వారు మాత్రమే మీ సేవ ద్వారా స్లాట్‌లు బుక్ చేసుకొని సూచించిన దవఖానకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. సదరం క్యాంపును జిల్లాలోని కొండాపూర్ జిల్లా దవాఖాన, వనస్థలిపురం ఏరియా దవాఖానలో నిర్వహించనున్నట్లు చెప్పారు. సదరం క్యాంపునకు వచ్చే దివ్యాంగులు తప్పసరిగా మీ సేవలో స్లాట్ బుక్ చేసుకొని, అ రశీదులో సూచించిన సమయానికి, సూచించిన దవాఖానకు రావాలన్నారు. మీ సేవ స్లాట్ బుకింగ్‌లో డీఆర్‌డీఏకు ఎలాంటి ప్రమేయం ఉండదన్నారు. దరఖాస్తుదారులు డాక్టర్స్ రిపోర్ట్‌తో పాటు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఫొటో తీసుకుని రావాలని సూచించారు.

వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బీజేఆర్ చౌరస్తాలో బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి – ధారూరు, ఏప్రిల్ 5

రాత్రి సమయాల్లో ఎక్కువ ట్యాంకర్ డెలివరీలు చేయాలి

ఫిల్లింగ్ స్టేషన్ల ఆకస్మిక తనిఖీలో జలమండలి ఎండీ

సిటీబ్యూరో, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : జలమండలి డివిజన్ –6 పరిధిలోని పలు ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్లను శుక్రవారం ఎండీ సుదర్శన్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎల్లారెడ్డి గూడ, ఎర్రగడ్డ, ఫతేనగర్, ఎస్ఆర్‌నగర్–1, 2, బోరబండ ఫిల్లింగ్ స్టేషన్లను పరిశీలించారు. ట్యాంకర్ బుకింగ్స్ డెలివరీ రికార్డ్స్‌ను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. బుకింగ్ లాగ్‌బుక్స్‌ను పరిశీలించారు. ట్యాంకర్ డెలివరీల్లో ఆలస్యం చేయవద్దన్నారు. బుకింగ్స్ అయిన తర్వాత సాధ్యమైనంత త్వరగా డెలివరీ చేయాలన్నారు. పెండెన్సీ లేకుండా ఉండేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. వాణిజ్య వినియోగదారులకు రాత్రి సమయాల్లో ఎక్కువ ట్యాంకర్ డెలివరీలు చేస్తే.. పెండెన్సీ లేకుండా చూడవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం హరి శంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్..

- వేసవి సెలవుల్లో తరగతులు - కార్పొరేట్ కళాశాలల నిర్వాకం

మియాపూర్ , ఏప్రిల్ 5 : ఇంటర్ బోర్డు ఆదేశాలను కార్పొరేట్ కళాశాలలు ఏమాత్రం ఖాతరు చేయటం లేదు. ప్రభుత్వ విద్యా క్యాలెండర్‌కు పాతరేసి.. తమ సొంత క్యాలెండర్‌ను బాహాటంగా అమలు చేస్తున్నారు. ఇటీవల ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ముగిశాయి. ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించింది. అయినప్పటికీ కార్పొరేట్ కళాశాలలు సెలవులను ఏమాత్రం అమలు చేయకుండా ద్వితీయ సంవత్సరం తరగతులను నిర్వహిస్తున్నారు. ఇటీవల పలు కళాశాలల్లో ఈ తరహా తరగతులపై విద్యార్థి సంఘాలు ఫిర్యాదు చేయటంతో డే స్కాలర్స్ కళాశాలలకు ప్రత్యక్ష తరగతులను నిలిపివేసి ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే రెసిడెన్షియల్ తరహాలో నడుస్తున్న కళాశాలల్లో గుట్టుగా ద్వితీయ సంవత్సరం తరగతులను కొనసాగిస్తున్నారు. అడ్వాన్స్డ్, జేఈఈ మెయిన్స్ సహా ఇతర పరీక్షల పేరిట వేసవి సెలవుల్లోనూ తరగతులను నిర్వహిస్తున్నారు. విద్యార్థుల నుంచి ఫీజులను వసూలు చేసేందుకు కొన్ని విద్యాసంస్థలు వేసవి తరగతులను అవకాశంగా వినియోగించుకుంటున్నాయి. ప్రధానంగా మాదాపూర్, మదీనాగూడ, కూకట్‌పల్లి, గచ్చిబౌలి, పటాన్‌చెరు సహా ఇతర ప్రాంతాల్లో వేసవి సెలవుల్లో తరగతులను నిర్వహిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను సెలవుల్లో కళాశాలకు పంపేందుకు ఆసక్తి కనబరుస్తుండటం గమనార్హం. విద్యా క్యాలెండర్ పేరిట తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్న విద్యార్థులు వేసవి సెలవుల్లోనూ తరగతుల పేరిట మరింత ఒత్తిడికి గురవుతున్నారు.

మాదిగ జాతిపై సీఎం రేవంత్‌రెడ్డి వివక్ష

జగ్జీవన్‌రామ్‌ను అవమాన పరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం :మాదిగ రాజ్యాధికార పోరాట సమితి

రవీంద్రభారతి, ఏప్రిల్ 5 : దేశ తొలి ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అవమానపరిచిందని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మన నవీన్‌రాజు అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి ఎప్పుడూ ఇలా అవమానం జరుగలేదని, సీఎం రేవంత్ రెడ్డి కావాలనే ఇలా చేశారని మండిపడ్డారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది బషీర్‌బాగ్‌లోని జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించి ప్రజలకు అన్ని వసతులు కల్పించేదని తెలిపారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి మాదిగ మహనీయులపై కుట్రపన్ని జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను అత్యంత దారుణంగా నిర్వహించారని మండిపడ్డారు. జయంతి వేడుకలకు వచ్చే ప్రజలకు కనీసం మంచినీటి సౌకర్యం, ఇతర వసతులు కల్పించకుండా మాదిగ మహనీయులను, మాదిగజాతిని అవమానపరిచారని విమర్శించారు. మాదిగ ఓట్లతో గెలిచిన సీఎం రేవంత్‌రెడ్డి మాదిగ మహనీయులను విస్మరించడం సరికాదని, ఈ విధంగానే మాదిగ జాతిపై వివక్ష కొనసాగితే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. రాబోయే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లకుంట నరసింహ, ముగులు కోటేశ్వరరావు, జగదీశ్ రావు, రామరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న మాదిగ రాజ్యాధికార పోరాట సమితి అధ్యక్షుడు నవీన్‌రాజు

ట్రాకింగ్‌లోకి వాటర్ ట్యాంకర్

ఎప్పుడొస్తుందో వినియోగదారుడికి తెలుసుకునే వీలు

ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెస్తున్న జలమండలి

సక్రమంగా అందేలా.. ట్యాంకర్ అడ్డదారిలో వెళ్లకుండా

రియల్ టైం ట్రాకింగ్ విధానంతో అక్రమదందాకు చెక్

సిటీబ్యూరో, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : వాటర్ ట్యాంకర్ల సరఫరాలో అక్రమాలకు చెక్ పెడుతూ జలమండలి కీలక నిర్ణయం తీసుకున్నది. గాడి తప్పుతున్న ట్యాంకర్‌ను ట్రాకింగ్‌లోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టింది. వినియోగదారుడికి అత్యంత పారదర్శకంగా ట్యాంకర్ నీటిని చేర్చేలా ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నది. ప్రస్తుతం వాటర్ ట్యాంకర్‌కు యమ డిమాండ్ ఉన్నది. ఇదే అదునుగా కొందరు ట్యాంకర్ నీటిని అడ్డదారిలోకి మళ్లిస్తూ అక్రమ దందాకు తెరలేపారు. ఈ నేపథ్యంలో రియల్ టైం ట్రాకింగ్ విధానాన్ని అమలు చేసి వాటర్ ట్యాంకర్ నీటిని సక్రమంగా అందించే చర్యలకు ఉపక్రమించారు. ఇందులో భాగంగానే పైలెట్ ప్రాజెక్టుగా కొన్ని ఫిల్లింగ్ స్టేషన్లలో కొత్త విధానాన్ని అమలు చేస్తుండగా, రాబోయే వారం రోజుల్లోగా 75 ఫిల్లింగ్ స్టేషన్లలో ట్రాకింగ్‌లోకి వాటర్ ట్యాంకర్‌ను తీసుకొస్తామని ఐటీ విభాగం అధికారులు తెలిపారు. సంస్థ పరిధిలో ఉన్న 700 ట్యాంకర్లను ట్రాకింగ్‌లోకి తీసుకువచ్చి ఉబర్, ఓలా తరహాలో వాహనం ఏ సమయంలో ఎక్కడ ఉంది? ఎంతసేపటిలో ట్యాంకర్ ఇంటికి చేరుతుందో సదరు వినియోగదారులు తెలుసుకునేలా పారదర్శక సేవలు అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

మత్తుకు అలవాటుపడి.. ప్రవృత్తిగా మార్చుకొని..

ఎండీఎంఏను విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు.. రూ.2.45 లక్షల విలువైన సరుకు పట్టివేత

సిటీబ్యూరో, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): డ్రగ్స్‌కు అలవాటు పడి, మత్తు పదార్థాలు సరఫరా చేయడమే ప్రవృత్తిగా మార్చుకున్న ఒక వ్యక్తిని సైబరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ. 2.45లక్షల విలువ చేసే 15 గ్రాముల ఎండీఎంఏ, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం...గుంటూరు జిల్లాకు చెందిన పొదిల జైచంద్ స్థానికంగా బీసీఏ కంప్యూటర్స్ చదివాడు. అనంతరం ఉపాధి కోసం నగరానికి వలస వచ్చి, ఎస్ఆర్‌నగర్‌లో వెంకటేశ్వర బాలుర హాస్టల్‌ను నిర్వహించాడు. ఓలా క్యాబ్ డ్రైవర్‌గా, అమీన్‌పూర్‌లో ఇసుక వ్యాపారం కూడా చేసిన జైచంద్.. 2022లో నాన్ ఐటీ ఉద్యోగిగా కూడా పనిచేశాడు. ఆ సమయంలో బెంగళూరుకు చెందిన తన స్నేహితుడు హర్ష ద్వారా సొంత జిల్లాకు చెందిన వివేక్‌ను పరిచయం చేసుకున్నాడు. వివేక్ ద్వారా ప్రకాశం జిల్లాకు చెందిన సోహన్ అలియాస్ శ్రీధర్ పరిచయమయ్యాడు. సోహన్ బెంగళూరు కేంద్రంగా డ్రగ్స్ సరఫరా చేస్తుంటాడు. ఈ క్రమంలో మాదకద్రవ్యాలకు అలవాటు పడిన జైచంద్ సులభంగా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకొని.. 2023లో ఉద్యోగానికి రాజీనామా చేశాడు. అప్పటి నుంచి సోహన్ వద్ద ఎండీఎంఏను కొనుగోలు చేయడం ప్రారంభించాడు. ఈ క్రమంలోనే గత నెల 26న బెంగళూరులో సోహన్ వద్ద 20గ్రాముల ఎండీఎంఏను కొని.. నగరానికి వచ్చాడు. అందులో నుంచి 5 గ్రాముల ఎండీఎంఏను సేవించిన జైచంద్.. మిగిలిన 15గ్రాములను విక్రయించేందుకు యత్నిస్తున్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసులు సన్‌సిటీ, పీ అండ్‌టీ కాలనీలోని జైచంద్ ఇంటిపై దాడులు చేసి, నిందితుడిని పట్టుకుని అరెస్ట్ చేశారు. తదుపరి విచారణ కోసం కేసును రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు.



వీ లవ్ ధోని! మార్మోగిన ఉప్పల్

సిటీబ్యూరో, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) :'వీ లవ్ ధోని.. వీ లవ్ ధోని' నినాదాలతో ఉప్పల్ స్టేడియం మార్మోగింది. శుక్రవారం ఉప్పల్ వేదికగా సన్‌రైజర్స్- హైదరాబాద్-చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో ప్రత్యేకించి ధోని గేమ్‌ను వీక్షించేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. మ్యాచ్ ప్రారంభానికి ముందే ఎండను సైతం లెక్క చెయ్యకుండా క్యూలైన్లో నిల్చొన్నారు. సాయంత్రం 4 గంటల నుంచే స్టేడియం లోపలికి అనుమతించారు. ఫ్యాన్స్ హంగామాతో ఉప్పల్ పరిసరాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. మరోవైపు ఐపీఎల్ టికెట్లను బ్లాక్‌లో విక్రయిస్తున్నారంటూ క్రీడాభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెయ్యి రూపాయల టికెట్‌ను రూ.6వేలకు పైగా విక్రయించారని ఆరోపించారు.